www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 20 డిసెంబర్ 2023



మన్నూరు ఈద్గాకు రూ.10 లక్షలు వితరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : మన్నూరు ఈద్గాకు రూ.10 లక్షల విరాళాన్ని నగదు రూపంలో కమిటీ సభ్యులకు టిడిపి నాయకులు గంటా నరహరి తన వ్యక్తిగత సహాయకులు మితలేష్, మన్నూరు టిడిపి నాయకులు ముప్పిడి చిన్నయ్యల చేతుల మీదుగా అందజేశారు. ముందుగా ఈద్గా కమిటీ సభ్యులకు స్వీట్లు తినిపించి తర్వాత రూ.పది లక్షల నగదును వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఈద్గా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గంటా నరహరి ఇచ్చిన మాటను మూడు రోజుల్లోనే నిలబెట్టుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో రాజంపేట ప్రాంతంలోని ముస్లిం సోదరులు అందరం గంటా నరహరికి అండగా ఉంటూ ఆయన అడుగుజాడల్లో నడుస్తామన్నారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ సభ్యులు జి.ఖాదర్ బాషా, ఎస్.ఖాదర్ బాషా, షేక్ మహమ్మద్ అలీ, షేక్ జిలాని బాషా, టి.రసూల్ హమ్మద్, ఎస్.మహబూబ్ బాషా, అబ్దుల్ ఖాదర్, గన్ బాషా, షంషేర్, రషీద్, యాసిన్, షేక్ షాహిద్ పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న నరహరి సహాయకులు

పోరుబాటలో అలుపెరగక...

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికి ఎనిమిదవ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఆయా కార్యాలయాల ఎదుట బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా వ్యాప్తంగా వంటావార్పు నిర్వహించారు. పలు చోట్ల భిక్షాటన చేశారు. మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.

- వంటావార్పు, భిక్షాటన, మోకాళ్లపై నిల్చుని వినూత్న నిరసన
- జిల్లా వ్యాప్తంగా 8వ రోజు కొనసాగిన సమ్మె



పీలేరు :వారపు సంతలో భిక్షాటన చేస్తున్న అంగన్వాడీలు



తంబళ్లపల్లె : వంట చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అంగన్వాడీలకు ముఖ్యమంత్రి ప్రతి పక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ కన్నా అదనంగా రూ.వెయ్యి ఇస్తామన్న మాట అమలుచేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు పేర్కొన్నారు. అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్ స్కీమ్‌ను కార్పొరేట్లకు కమీషన్ కోసం ప్రైవేటీకరించి పేద పిల్లలు, గర్భిణులు, బాలింతలకడుపు కొడుతూ వారి మరణాల పెంచడానికి కారణమవుతూ పేద ధనిక అంతరాలు పెంచుతూ సేలందించే అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నాయని పేర్కొన్నారు. సిఐటియు ంగన్వాడీలకు అండగా పోరాడుతుందన్నారు. అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలకొట్టడం పనికిమాలిన చర్యగా పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట రోడ్డు పొడువునా భారీ లైనుతో వంటా వార్పు కార్యక్రమం ప్రజానీకాన్ని ఆకర్షించింది. రోడ్డుపైనే సుమారు 700 మంది భోజనం వండుకుని తినడం విశేషం. వంటా వార్పు కార్యక్రమానికి విద్యుత్ రంగం నాయకులు ఎంవి.రమణ సుబ్రహ్మణ్యం రాజు, ఆశా రంగం నాయకులు ఆదిలక్ష్మి, సంగీత, పుష్పలత, కాంగ్రెస్ పార్టీ రైతు నాయకులు విఆర్‌డిఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, అంగన్వాడీ నాయకులు సిద్దమ్మ, భాగ్యలక్ష్మి, బంగారుపాప, మస్రూన్ బీ, ఖాజాబి, నాగమణి, సబీనా, విజయ, అరుణ, సుమలత, జయ, కవిత, లక్ష్మిదేవి, పద్మజ, రమణమ్మ, అంజలి, శైలజ, రెడ్డెమ్మ పాల్గొన్నారు. **పీలేరు :** అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు వారపు సంతలో భిక్షాటన చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. స్థానిక వారపు సంతలో వారు కొంగు పట్టి భిక్షాటన చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కారం చేయకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు తమకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్లే సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దనాసి వెంకటరామయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంగన్వాడీలకు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే వేతనం కన్నా అదనంగా వెయ్యి రూపాయలు వేతనం ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు దాన్ని అమలు చేయక పోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఎపి గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ నాయక్, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి, ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి, సిపిఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్.వెంకటేష్, అంగన్వాడీలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :**డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు వివిధ రూపాలలో నిరసన తెలుపుతున్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు సిఐటియు ఆధ్వ ర్యంలో వంటావార్పు కార్యక్రమం ద్వారా వినూత్నంగా నిరసన తెలిపారు. డిమాండ్లు నెరవేర్చువరకు ఉద్యమం ఆగదని ఈ సందర్భంగా అంగన్వాడీలు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, అంగన్వాడీ వర్కర్లు రమాదేవి, సుజాత, ఈశ్వరమ్మ, శివరంజిని, విజయ, అమరావతి పాల్గొన్నారు. **మదనపల్లి:** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు వంటావార్పు చేసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు తెలకపల్లి హరింద్రనాథ్‌శర్మ, ప్రభాకర్‌రెడ్డి, మధురవాణి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నామని అందులో భాగంగా వంటావార్పు నిర్వహించి నిరసన తెలియజేశామన్నారు. అనంతరం బిసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో గౌరీ, కరుణ, స్వారూపా, భూకైలేశ్వరి, అమ్మాజీ, విజయ, అఖిరున్నిసా, బాగ్యా, గీతా సుజాని, శ్రీవాణి, ఈశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :**అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వేతనాల పెంపు, గ్రాట్యూటీ తదితర సమస్యల సాధనకై చేపట్టిన సమ్మెలో భాగంగా అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి, ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షులు, మంజుల, అధ్యక్షులు ఎన్.రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్, రాధా కుమారి, మండల కార్యదర్శి జి.పద్మ, వెన్నెల, శిరీష, లీలావతి, ఈశ్వరమ్మ, మైతిలి, సునీత, నిర్మల, వాణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పి.జాన్ ప్రసాద్, అంగన్వాడీ వర్కర్స్ అసోసియేషన్ ఎఐటియుసి జిల్లా కో-కన్వీనర్ సరోజ, నాయకులు రాధాకృష్ణ పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** న్యాయమైన కోరికలు సాధనకు అంగన్వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. లక్కిరెడ్డిపల్లి సిడిపిఒ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు మండలాలకు చెందిన అంగన్వాడీలు నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధ్యక్షులు సుకుమారి మాట్లాడుతూ ఎనిమిది రోజులుగా అంగన్వాడీ కార్మికులు రోడ్డుపైకి వచ్చి సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించుకోవడం దారుణమన్నారు. న్యాయమైన కోరికలు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రూ.ఐదు లక్షల గ్రాట్యూటీ, కనీస వేతనం రూ.26 వేల రిటైర్మెంట్ పెన్షన్‌తో వేతనంలో సగం ఇచ్చేదాకా సమ్మె విరమించమన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సుకుమారి, ఓబుళమ్మ, ప్రభావతి, సెక్టార్ లీడర్లు శారదా, శ్రీవాణి, చిట్టెమ్మ, సుభాషిణి, ఇరాగమ్మ, రెడ్డెమ్మ, లక్ష్మీదేవి, నాగమణి, నాగవేణి పాల్గొన్నారు. అంగన్వాడీలకు మాజీ సర్పంచ్ చెంద్రా యుడు, రొండా చలపతి, మన్సూర్, రిజ్వాన్, ఇస్మాయిల్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చెంద్రాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వేతనాలు రూ.4500 నుండి రూ.10,500లకు పెంచిన ఘనత చంద్రబాబు నాయు డుకు దక్కుతుందని తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంగ న్వాడీల న్యాయమైన కోరికలు నెరవేరుస్తుందన్నారు. **బి.కొత్తకోట :** తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ అంగన్వావాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. పట్టణంలోని జయశ్రీ కాలనీ అంగన్వాడీ కేంద్రం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. బి.కొత్తకోట, ములకల చెరువు, పిటిఎం నుంచి వచ్చిన అంగ న్వాడీ టీచర్లు, హెల్పర్లు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయపరమైన డిమాండ్ల కోసం నిరసన తెలుపుతుంటే నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తుండడం బాధా కరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మా బాధలను ఆలకించి సమస్యలను పరిష్క రించాలని విజ్ఞప్తి చేశారు. **తంబళ్లపల్లె :** అంగన్వాడీల సమస్యలను పరిష్కరిం చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివా సులు అన్నారు. తంబళ్లపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్వా డీలు వంటావార్పు నిర్వహించారు. అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా వంటా వార్పులో పాల్గొన్న శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్వాడీల కోరికలు న్యాయ మైనవన్నారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలు బద్దలు గొట్టడం చట్ట విరుద్ధమని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు స్వాధీనం చేసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రజలు స్వాధీనం చేసుకుంటే ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. తక్షణం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అంగన్వాడీలకు మద్దతుగా ప్రజలను కూడగట్టి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీల సమ్మెకు వెలుగు యానిమేటర్స్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు గౌరి, కరుణశ్రీ, సులోచన, స్వరూప, ప్రమీల, సరస్వతి, ఉమాదేవి, షరీఫా, విఒఎ యూనియన్ నాయకులు రెడ్డెప్ప, రాణి, రాజేశ్వరి లతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మదనపల్లె : వంటవార్పుతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



రాజంపేట : వంటవార్పుతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



రాయచోటి : అంగన్వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న ఓబులు

డిసిసి మైనార్టీ వైస్ చైర్మన్‌గా అలీఖాన్

ప్రజాశక్తి - రాయచోటి

కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా మైనార్టీ విభాగం వైస్ చైర్మన్‌గా పట్టణానికి చెందిన పఠాన్ మహమ్మద్ అలీఖాన్‌ను నియమిస్తూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు రాష్ట్ర మైనార్టీ విభాగం చైర్మన్ షాలి దాదా గాంధీ ఉత్తర్వులు జారీ చేశారు. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలోపేతానికి కృషి చురుకుగా సేవలందిస్తున్న పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం జిల్లా మైనార్టీ విభాగం వైస్ చైర్మన్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసి రెడ్డి, రాష్ట్ర మైనార్టీ విభాగం వైస్ చైర్మన్ కొత్వాల్ మహమ్మద్ రఫీ, డిసిసి అధ్యక్షులు షేక్ అల్లాబకష్, డిసిసి మైనార్టీ విభాగం చైర్మన్ ఆడిటర్ మన్సూర్ అలీఖాన్, డిసిసి ఉపాధ్యక్షులు దర్బార్‌బాష, జిల్లా మైనార్టీ విభాగం కార్యదర్శి యహియా బాషకుఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. **మదనపల్లి:** కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు రెడ్డీ సాహెబ్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కె.మీనా కుమారి, ప్రధాన కార్యదర్శి వి.వెంకటరమణ, కార్యదర్శి ఎల్.చలపతిని దుస్సాలువలు, పూలమాలల వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మదనపల్లి రూరల్ మండల అధ్యక్షులు వై.సురేంద్రరెడ్డి, నిమ్మనపల్లి మండల అధ్యక్షులు ముబారక్ ఖాన్, సీనియర్ నాయకులు డాక్టర్ బాష, మహబూబ్ పీర్, మహమ్మద్ అలీ, బిసి నాయకులు పాలేటి, మండల సీనియర్ నాయకులు సోమశేఖర్, నారాయణ, రవి, రమణ, శరత్ కుమార్‌రెడ్డి, సుర్యా, విజయ్, ఆనందబాబు, మహిళా నాయకులు రిజ్వాన, ప్రమీల, ఈశ్వరమ్మ, ఖాషీమ్, శుభాష్, సమీర్, యూత్ నాయకులు భయ్యారెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, చిన్ను పాల్గొన్నారు.

26 నుంచి 'ఆడుదాం ఆంధ్ర' : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ఈ నెల 26వ తేదీ నుంచి జిల్లాలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహించనున్నామని, వాటిని విజయవంతం చేయడానికి అధికారులందరూ బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ నుంచి ఆడుదాం ఆంధ్ర, రెవెన్యూ, ఎన్నికలు అంశాలపై ఎంపిడిఒలు, తహశీల్దార్లు, ఆర్‌డిఒలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమ నిర్వహణకు రిజిస్ట్రేషన్ చేశారని, మహిళలకు ప్రాధాన్యతనిచ్చి మరింతగా చేయాలని సూచించారు. ఆడుదాం ఆంధ్రా పోటీలను కబడ్డీ, ఖోఖో, షటిల్, వాలీబాల్, క్రికెట్ లాంటి 5 అంశాలలో ఉత్సాహపరితంగా నిర్వహించాలన్నారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వం వస్తుందన్నారు. అందరికీ ఆరోగ్యం పై అవగాహన కల్పించేందుకే ప్రభుత్వం క్రీడలను నిర్వహిస్తోందన్నారు. ఈనెల 20 నాటికి ఆయా అంశాలలో టీం ఫార్మేషన్‌ను పూర్తి చేయాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో క్రీడలు నిర్వహించేందుకు ఒక మైదానం ఉండాలని, మైదానం ఏర్పాటులో పంచాయతీ సెక్రెటరీ, ఎంపీడీవో బాధ్యత తీసుకోవాలని చెప్పారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. రెవెన్యూ అంశంలో భాగంగా అసైన్‌మెంట్ ల్యాండ్ రీ వెరిఫికేషన్‌లో ఎట్టి పరిస్థితుల్లో తప్పులు ఉండరాదు. ఈనెల 23 లోపు అన్ని మండలాల నుంచి నివేదిక పంపాలని సూచించారు. ఈ సందర్భంగా విలేజ్ సర్వీస్ ఇనామ్, డిజిటల్ సిగ్నేచర్ అంశాలపై సమీక్షించారు. ఎలక్షన్స్‌కు సంబంధించి ఓటర్ జాబితా అంశంలో భాగంగా పిఎస్ఇ, డిఎస్ఇలలో వందశాతం ఫారం-7 జనరేట్ చేయాలన్నారు. డబుల్ ఎంట్రీలు ఉండకుండా చూసే బాధ్యత తహశీల్దార్, ఆర్‌డిఒలపై ఉందన్నారు. క్లస్టర్ వారీగా ఫారం- 7, ఫారం-8 సాంకేతిక సమస్యతో పెండింగ్ ఉన్నవాటిపై బిఎల్‌ఒలతో తహశీల్దార్లు సమావేశం నిర్వహించి వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో జెసి ఫర్మన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ, జిల్లా స్పోర్ట్స్ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

పంట నష్టాన్ని పకడ్బందీగా నమోదు చేయాలి

- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో జరిగిన పంట నష్టాన్ని పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండల చైర్మన్ మాట్లాడుతూ మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో అన్నమయ్య జిల్లాలో చాలావరకు అరటి, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయని, వాటి వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాలలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి వారికి కావాల్సిన ఎరువులు విత్తనాలు సకాలంలో అందజేయాలన్నారు. జెసి మాట్లాడుతూ రబీ 2023- 24 సంవత్సరానికి సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలన్నారు. జాబితాపై సామాజిక తనిఖీ నిర్వహించి ఆ రిపోర్టును వెంటనే ఉన్నతాధికారులకు పంపాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 16144 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటివరకు 10550 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు ఇచ్చారని, ఎక్కడా ఎరువుల కొరత లేదని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి చంద్ర నాయక్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు రవిరాజు, పశుసంవర్ధక శాఖ జెడి గుణశేఖర్ పిళ్లై, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హౌసింగ్ అక్రమాలపై విజిలెన్స్ విచారణ

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లా కేంద్రమైన రాయచోటి అర్బన్ హౌసింగ్‌లో చోటు చేసుకున్న అక్రమాలపై విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపడుతున్నట్లు సమాచారం. ఇటీవల కలెక్టర్ కార్యాలయ ఆవరణంలోని జిల్లా గృహ నిర్మాణ శాఖ (పీడీ) కార్యాలయంలో ఇరువురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్న నేపథ్యంలో రమేష్ నాయక్ అనే వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నం చేశాడు. ఈ విషయం సోషల్ మీడియాలో రావడంతో స్పందించిన విజిలెన్స్ అధికారులు రాయచోటికి చేరుకుని నారాయణ రెడ్డి గారి పల్లెకు సమీపంలో గల జగనన్న కాలనీలో సిమెంటు, కడ్డీలు, ఇసుక లబ్ధిదారులకు పంపిణీ చేసిన విషయంపై, ప్రభుత్వం నుంచి ఎంత స్టాక్ వచ్చింది, ఎంత పంపిణీ చేశారు అనే విషయాలపై తీస్తున్నట్లు సమాచారం.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఆయా ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తల పోస్టులను భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిక అధికారి ఎం.ధనలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడీలు కార్యకర్తలు 20, సహాయకులు 43, మినీ అంగన్వాడీ కార్యకర్తలు 11 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 23న సాయంత్రం 5 గంటలలోపు ఆయా కార్యాలయాల్లో సమర్పించాలన్నారు.

మందరంలో పశు వైద్య శిబిరం


ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న గొర్రెలు మేకలలోని పారుడు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని మందరం గ్రామంలోని గిరిజన కాలనీలో మంగళవారం అత్తిరాల పశు వైద్యాధికారిణి భాగ్యవతి ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. 246 మేకలకు పారుడు వ్యాధి టీకాలు, 300 గొర్రెలు మేకలకు నట్టల నివారణ, 308 మేకలు, పశువులకు పిడుదల నివారణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులకు పశు సంరక్షణ ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ వై.విజయభాస్కర్ రావు రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఎహెచ్ఎ విద్యాసాగర్, పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన కంటి వైద్య సేవలందించాలి : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలను పొందాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని నూతనంగా ఏర్పాటైన డాక్టర్ అగర్వాల్ ఐ క్లినిక్ 169వ శాఖను మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మత గురువు సర్ణాజీ షరూద్దీన్‌లతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటిని జాగ్రత్తగా, రక్షించు కోవా లన్నారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన డాక్టర్ అగర్వాల్ ఐ కేర్ సంస్థ వారు జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఐ క్లినిక్‌ను ఏర్పాటు చేయ డం హర్షణీయమన్నారు. ఇది వర్చువల్‌గా కనెక్ట్ అయిన నిపు ణులైన వైద్యులుతో చికిత్సలును అందిస్తారని తెలిపారు. అత్యాధునిక పరికరాలతో వైద్య సేవలు ఇక్కడ లభ్యం కానున్నాయన్నారు. రాయచోటి ప్రాంతంలో పేద ప్రజలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా తగ్గింపు రేట్లతో వైద్య సేవలు అందించాలని కోరారు. అగర్వాల్ ఐ కేర్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ గణేష్, సుబ్రమణ్యం మాట్లాడుతూ సంపూర్ణ కంటి సంరక్షణను అగర్వాల్ ఐ కేర్ సంస్థ నిబద్ధతతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గోపికృష్ణ, లయన్ తులసీశ్వర్‌రెడ్డి, ఫయాజ్ అహమ్మద్, పట్టణ అధ్యక్షుడు రియాజుర్ రెహమాన్, అష్రఫ్ పాల్గొన్నారు.



శ్రీకాంత్‌రెడ్డికి మెమోంటో ఇస్తున్న నిర్వాహకులు



సైన్స్ మేళాను పరిశీలిస్తున్న డిఇఒ పురుషోత్తం

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి : డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం అన్నారు. మంగళవారం స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ మేళా నిర్వహించారు. ఆయన మేళాను సందర్శించి మాట్లాడారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే సైన్స్ పట్ల అవగాహన పెంపొందించాలన్నారు. సైన్స్‌తోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. అనంతరం ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రోబోటిక్'లో మిట్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో బి.టెక్ మూడవ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్) చదువుతున్న ఎం.విశ్వనాథ్, ఎం.చైతన్య, జి.వినయ్, ఎం.వెన్నెల, ఎస్.వైష్ణవి, జి.బిందుశ్రీ, సి.స్వాతి, జి.జయశ్రీ, వెంకట మురళీధర్‌రెడ్డి, సనత్ కుమార్ ఇస్రో రోబోటిక్స్ ఛాలెంజ్ 2024లో ప్రతిభ కనపరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. రోబోటిక్ కింగ్స్ పేరుతో ఈ ఛాలెంజ్‌లో చంద్రయాన్ 4కు కావలసిన విక్రమ్ ల్యాండర్ నమూనాలను కనుగొనుటకు నూతన టెక్నాలజీని ఈ విద్యార్థులు తయారు చేయుటకు అవకాశం లభించిందని తెలిపారు. ఇస్రో వారు చంద్రుడు, ఇతర ఖగోళ వస్తువులకు భవిష్యత్తులో రోబోటిక్ అన్వేషణ మిషన్లకు సన్నద్ధమవుతోందని పేర్కొన్నారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగా సాంకేతిక అభివృద్ధి కార్యకలాపాల్లో పాల్గొనేందుకు విద్యా సంస్థలు పరిశ్రమలకు ప్రత్యేక అవకాశాలను కల్పించేందుకు ఈ ఛాలెంజ్‌ను నిర్వహించడం జరిగింది. ఇందులో సుమారు 1000 టీంలకు పైగా ఇందులో పాల్గొనగా, 50 టీంలను ఇస్రో వారు ఎంపిక చేయగా అందులో మిట్స్ కళాశాల టీం ఒకటని పేర్కొన్నారు. అంతరిక్ష రోబోటిక్స్‌లో అభివృద్ధి అవకాశాలను అందించే లక్ష్యంతో అంతరిక్ష రోబోటిక్స్ ఛాలెంజ్ నిర్వహించడం, తద్వారా భవిష్యత్ మిషన్‌ల కోసం రోబోటిక్ రోవర్‌ల వినూత్న ఆలోచనలు మరియు డిజైన్‌లను భారతీయ యువత కు అవకాశ కల్పనకై ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. ప్రతిభ కనపరిచిన ఈ విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ చొక్కనాదం అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపల్ యువరాజ్


కోమటివాని చెరువులో చేప పిల్లలను వదులుతున్న అధికారులు, మత్స్యకారులు

మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నాదని జిల్లా మత్స్యశాఖ అధికారిణి సుస్మిత అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం మండల పరిధిలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో తవళంలో ఉన్న కోమటివాని చెరువు, నిమ్మనపల్లిలో ఉన్న అహోబిలనాయుని చెరువులలో మత్స శాఖాధికారి సుబ్బనరసయ్య, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్‌లు రెడ్డప్ప, పాపలమ్మ భర్త మల్లప్ప, మత్స్యశాఖ సంఘం నాయకులు సివి రమణరెడ్డి, చంద్రాయుడులతో కలసి ఎపి లిఫ్ట్‌పథకం ద్వారా వందశాతం రాయితీతో రెండు లక్షల చేప పిల్లలను ఫలసాయానికై వదలడం జరిగిందన్నారు. చెరువులలోని చేప పిల్లలను సంరక్షించుకుంటూ మత్స్య కారులు అభివృద్ధి చెందాలని సూచించారు. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాలుగా తోడ్పాటును అందిస్తు న్నాదని పేర్కొన్నారు. త్వరలోనే మండలంలో ఉన్న బహుదా ప్రాజెక్టులో కూడా చేప పిల్లలను వదలడం జరుగు తుందని తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలోని సంఘంలో ఉన్న సంఘ సభ్యులందరూ మత్స్య సంపదను పెంపొందిం చడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి సుబ్బనరసయ్య, మత్స్యశాఖ సంఘం సభ్యులు సివి.రమ ణరెడ్డి, చంద్రాయుడు, నాయకులు శంకర, గంగాధర, విజయ్‌కుమార్ రెడ్డి, మల్లప్ప, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

నేడు బి.కొత్తకోట మండల సమావేశం

బి.కొత్తకోట : మండల సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం లో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శంకరయ్య పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుతీరుపై ఈ సమావేశంలో చర్చించనున్నారన్నారు. శాఖలకు చెందిన అధికారులు తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకొని రావాలన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపిపి, జడ్పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ,ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

23న గాలివీడు..

గాలివీడు : ఈనెల 23న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శేఖర్ నాయక్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మండల సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. మండల సమావేశానికి హాజరయ్యే మండలస్థాయి అధికారులు తమ నివేదికలతో పూర్తి సమాచారంతో హాజరుకావాలని పేర్కొన్నారు. ఎంపిపి అధ్యక్షతన జడ్పిటిసి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు మండలస్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

తెలుగు రచయితల మహాసభలకు 'గంగనపల్లి'

ప్రజాశక్తి-నందలూరు

వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 23, 24 తేదీలలో కడప జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే మహాసభలకు మండలంలోని నాగిరెడ్డిపల్లికు చెందిన తెలుగు ఉపాధ్యాయులు, కవి, రచయిత గంగనపల్లి వెంకటరమణ ఆహ్వానం అందుకున్నారు. ఈ మేరకు రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి ఆహ్వానం పంపారు. కడప జిల్లాకు చెందిన భాష, చరిత్ర, సంస్కృతి, సాహిత్య వికాస పరిణామాల సమీక్షగా రెండు రోజులపాటు నిర్వహించే ఈ మహాసభలకు ఉమ్మడి కడప జిల్లాకు చెందిన కవులు, రచయితలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలువురు ప్రముఖులు, సాహితీ ప్రియులు, భాషాభిమానులు, తెలుగు ఉపాధ్యాయులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జరిగే కవి సమ్మేళనంలో కడప జిల్లా కవుల గురించి తాను కవితా గానం చేయనున్నానని వెంకటరమణ తెలిపారు.

రేపు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని ఈనెల 21న గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు, పలమనేరు నియోజ కవర్గ పరిశీలకులు, మాజీ ఎంపిపి పాగొండ ఖలీల్‌అహ్మద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని స్థానిక జ్యోతి బస్టాండ్ వద్ద జరిగే ఈ రక్తదాన శిబిరం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని యువకులు, ఎంపి టిసిలు, సర్పంచ్‌లు, వైసిపి కార్యకర్తలు, పెద్దిరెడ్డి కుటుంబ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యలు గాలికొదిలేసిన జగన్

ప్రజాశక్తి-వీరబల్లి

జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాజంపేట జనసేన పార్టీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకట రమణ పేర్కొన్నారు. పవనన్న ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని ఒడివీడు గ్రామాలలో, తాటికుంటపల్లి పంచాయతీ, సానిపాయి కుమ్మరపల్లి గ్రామాలలో నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి జనసేన పార్టీ రూపొందించిన సిద్ధాంతాల కరపత్రాలను పంచిపెట్టారు. మండలంలోని టిడిపి, జనసేన ప్రజలు నీరాజనాలు అర్పిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నియంతగా ప్రవర్తిస్తూ ప్రజా సమస్యలను గాలికొదిలేశారని అన్నారు. వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారని అన్నారు. రాజంపేటలో అసెంబ్లీ స్థానం టిడిపికి ఇచ్చినా, జనసేనకు కేటాయించి పవన్‌కల్యాణ్ నిర్ణయమే తమకు శిరోధార్యమన్నారు.కార్యక్రమంలో జనసేన నాయకులు పిరిగారి జయరాం, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వరల్డ్‌కప్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన దేవేంద్ర

ప్రజాశక్తి-రామాపురం

2024 సంవత్సరం మార్చి 2,3వ తేదీలో ఢిల్లీలో జరిగే అంతర్జాతీయ వరల్డ్ కప్ షూటింగ్ బాల్ క్రీడలకు రామాపురం మండలం బిసి కాలనీ చెందిన దేరం గుల దేవేంద్ర ఎంపికయ్యాడు. అనంతపురం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొని జాతీ య స్థాయికి ఎంపికయ్యాడు. వారణాసిలో జరిగిన జాతీ యస్థాయి పోటీల్లో సత్తాచాటి అంతర్జాతీయ పోటీలకు ఎంపిక య్యాడు.దేరంగుల దేవేంద్ర ఎంపిక పట్ల మండల ప్రజలు, ఉపాధ్యా యులు హర్షం వ్యక్తం చేశారు.

తూనికలు, కొలతలలో తేడాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి


తూనికలను పరిశీలిస్తున్న అధికారులు

తూనికలు కొలతలు తేడాలకు పాల్పడితే చర్యలు తప్పవని తూనికలు కొలతల శాఖ అధికారి నాగరాజు రమేష్ రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లిలో తూనికలు, కొలతల శాఖ ఇన్స్‌పెక్టర్ నాగరాజు, ఎమ్.వి రమేష్ కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో బరువు యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి, రామాపురం, చక్రాయపేట మండలాలలోని వ్యాపారస్తులకు బరువు యంత్రాల పరిశీల నకు హాజరు కావాలని తెలిపారు. బరువు యంత్రాలలో తూకాలు తేడాలు గమనించి పరిశీలించారు. ఎలక్ట్రానిక్ తూకాలలో ఉండే లోడ్ సెల్‌ను గమనించి తూకాలను సరిగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ప్రతి వ్యాపారి నిబంధనలు పాటించాలన్నారు. నిర్ణీత కాలపరిమితి పూర్తయిన వెంటనే తిరిగి కాటాలకు అనుమతి తీసుకోవడం, తూకం రాళ్లకు ముద్రలు వేయించుకోవాలన్నారు. నిర్ణీత గరిష్ట ధరలు కంటే ఎక్కువ విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తూకాలలో తేడాలకు పాల్పడితే వారు చేసే వ్యాపార విలువను బట్టి 500 నుంచి 26 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో తూనికలు కొలతలు సిబ్బంది, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

సైన్స్ పట్ల విద్యార్థులకు సృజనాత్మకత అవసరం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి


పీలేరులో జరిగిన సైన్స్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న ఎంఇఒలు

విద్యార్థుల్లో సైన్స్‌పై సృజనాత్మకత అవసరమని ఎంఇఒ పద్మావతి అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిమ్మనపల్లి (తెలుగు)లో మండల స్థాయి సైన్స్ పోటీలను నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 నారాయణ, హెచ్ఎం అంజాద్ అలీఖాన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థుల్లోని సృజనాత్మకత, సైన్స్‌లోని ప్రావీణ్యాన్ని వెలికితీయడానికి సైన్స్ పోటీలను ప్రభుత్వం నిర్వహించడం జరుగుతున్నాదని అన్నారు. ఇందులో మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలలోని విద్యార్థులు సైన్స్, గణితం, సోషియల్ కు సంబంధించి ప్రదర్శనలను ప్రదర్శించడం జరిగిందన్నారు. వాటిలో రెడ్డివారిపల్లి ఏపీ మోడల్ స్కూల్ కు చెందిన విద్యార్థి జె.వికాస్‌రెడ్డి మొదటిస్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో జడ్పి హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ఎం.కీర్తన, ఎపిమోడల్ స్కూల్ కు చెందిన వి.హారికరెడ్డి, ఎస్.రాధిక ఉత్తమ ప్రదర్శనలతో తృతీయస్థానంలో నిలిచారన్నారు. త్వరలో జరగబోయే జిల్లాస్థాయి సైన్స్ పోటీలలో మీరు పాల్గొంటారని అన్నారు. ఈ సందర్భంగా సైన్సు పోటీలలో గెలుపొందిన విద్యార్థులను ఎంఇఒలు పద్మావతి, నారాయణ, హెచ్ఎం అంజాద్ అలీఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **నందలూరు :** విద్యార్థి దశ నుంచే పరిశోధనలను ప్రోత్సహించి నట్లయితే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంఇఒ నాగయ్య పేర్కొన్నారు. నాగిరెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టడానికి పరిశోధనాత్మక కార్యక్రమాలను ప్రోత్సహించడం చాలా అవసరమని అన్నారు. సైన్సును మానవాభివృద్ధికి ఉపయోగపడేటట్లు చేయడం సైన్సు ప్రదర్శన ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. మండలంలో అన్ని సైన్స్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న సైన్స్ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ ప్రదర్శన నుంచి జిల్లాస్థాయికి వ్యక్తి గత విభాగం నుండి ఒకటి, జట్టు విభాగం నుంచి ఒకటి, ఉపాధ్యాయ విభాగం నుంచి ఒక ప్రయోగం ఎంపిక చేయబడ్డాయి. **కలకడ:** మండలంలోనికలకడ బాటవారిపల్లె పాఠశాలలో జరి గిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌లో నోడల్ ప్రధానోపాధ్యాయులు మోడెం చెంగలరాయుడు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరారు. ప్రతి విద్యార్థి లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడమే ఈ సైన్స్ ఫెయిర్ ఉద్దేశమని తెలిపారు. ఎంఇఒ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇటువంటి సైన్స్‌ఫెయిర్‌లో ప్రతి విద్యార్థి ఉత్సాహంగా పాల్గొనాలని శాస్త్రవేత్తలుగా ఎదిగి సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వైవి.రమణ, సివి.రమణ, శాంతమ్మ, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి** :విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్కోణం పెంపొందించడానికి సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేశారని ఎంఇఒలు చక్రి నాయక్, వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను విశ్రాంత ఎంఇఒ సెలవరాజు, ప్రిన్సిపాల్ శివశంకర్ రెడ్డిలు ప్రాజెక్టుల నమూనాలను పరిశీలించి ముగ్గురు విద్యార్థులను జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు పరిశీలకులు విజయ, నిత్య, పూజయా, సుధీర్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి :** సైన్స్ పట్ల విద్యార్థుల్లో సృజనాత్మకత అవసరమని సర్పంచ్ బీబీఆయేషా అన్నారు. కలికిరి మండలం గడి గ్రామంలో జడ్పి ఉర్దూ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. కలికిరి మండలం లోని అన్ని పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు తాము తయారు చేసిన సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శనలో ఉంచగా స్థానిక సర్పంచ్ కె.బీబీఆయేషా ప్రారం భించారు. ఎంఇఒ -2 నాగార్జునతో పాటు హెచ్ఎం శ్రీనివాసులు రెడ్డి లు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వలన విద్యార్థులలో సైన్సు పట్ల మంచి వైఖరులు, సృజనాత్మకత అలవడు తుందన్నారు. **పీలేరు:** విజ్ఞాన శాస్త్రం విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుతుందని ఎంఇఒలు లోకేశ్వర్ రెడ్డి, పద్మావతి తెలిపారు. పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం, పాఠశాల నోడల్ అధికారి విజి.నటరాజన్ ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. దీనికి పరిశీలకులుగా ఎంఇఒ వ్యవహరించారు. పీలేరు మండల పరిధిలోని ఉన్నత పాఠశాలల 8,9,10 తరగతుల విద్యార్థులకు మండల స్థాయిలో సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. మండలంలోని 15ఉన్నత పాఠశాలలు, నాలుగు గురుకుల పాఠశాలల విద్యార్థులు మూడు విభాగాల్లో తయారు చేసిన వివిధ ప్రాజెక్టులతో సందడి చేశారు.. ప్రభుత్వ జూని యర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు వెంకట్రమణ, రెడ్డిరాము, సుధా కర్‌రెడ్డి, బాలక్రిష్ణలు న్యాయ నిర్ణీతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు మురళీధర్‌రాజు, నాగరాజ, మాధవి, అశోక్ పాల్గొన్నారు.


లక్కిరెడ్డిపల్లె: జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంఇఒ

వాలంటీర్ల సేవలు అభినందనీయం : 'మేడా'

ప్రజాశక్తి-సుండుపల్లి


వాలంటీర్‌కు దుస్తులు, బ్యాగ్ అందిస్తున్న ఎమ్మెల్యే మేడా

వాలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయమని అన్నారు.ఈనెల 21న సిఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని వాలంటీర్లకు దుస్తులు, బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా వాలంటీర్లను నియమించినప్పటి నుంచి ప్రజలకు సంక్షేమ పథకాలు సమయానికి అందుతున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ సంక్షేమ అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలవడంలో వాలంటీర్ల కృషి ఎంతో ఉందని ఆయన అన్నారు. కేవలం సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా కరోనా సమయంలో ప్రజలకు మేమున్నామంటూ సహాయక చర్యలు అందించడంలో తమ ప్రాణాలను కూడా లెక్కచేయకుండా ప్రభుత్వ రెవిన్యూ, వైద్య, పోలీస్ సిబ్బందితో కలిసి పని చేసి సమాచారం అందించి ఇంటి వద్దకే సేవలు అందించడంలో వాలంటీర్ల సేవలు మరువలేనివి అన్నారు కార్యక్రమంలో:వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామస్వామిరెడ్డి, జడ్పిటిసి ఇస్మాయిల్, ఎంపిపి రాజమ్మ , మండల జె.సి.ఎస్ కన్వీనర్ రెహమాన్‌ఖాన్, కో-ఆప్షన్ నెంబర్ కలీంబాషా, స్టేట్ బిసి డైరెక్టర్ రాజు, మంత్రి శివారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా రమేష్

రైల్వేకోడూరు : వైసిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా స్థానిక ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుని శెట్టి రమేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రమేష్ వైసిపి కార్యాలయంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆయన సతీమణి స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి ప్రశాం తితో కలిసి కొరముట్లను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, ఉప సర్పంచ్ తోట శివసాయి, నరసింహ పాల్గొన్నారు.

ఎస్‌టి సెల్ కన్వీనర్‌గా చిన్న నియామకం



పీలేరు : వైసిపి పీలేరు మండల ఎస్‌టి సెల్ కన్వీనర్‌గా చిన్న నియమితులయ్యారు. గత పదేళ్లుగా వైసిపి అభివృద్ధికి తాను చేసిన కృషి ఫలితమే ఈ పదవి దక్కిందని అన్నారు. గత ఏడాది కాలంగా ఎస్‌టి సెల్ మండల కన్వీనర్‌గా ఉన్నానని, రెండో సారి కూడా తనకు అదే పదవి అప్పగించారని చెప్పారు. తనపై నమ్మకంతో రెండోసారి ఇచ్చి సెల్ కన్వీనర్ పదవిని బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తానని తెలిపారు.

వారపు సంతలో కనీస సదుపాయాలు కల్పిస్తాం

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక వారపుసంతలో కనీస సదుపాయాలు కల్పిస్తామని జనసేనపార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామదాస్ చౌదరిఅన్నారు. ప్రతి మంగళవారం వేలమందితో కళకళలాడే మదనపల్లె వారపు సంతలో కనీస సదుపాయాలు కల్పించడంలో పాలకులు విఫలం అయ్యారని ఆయన విమర్శించారు. మంగళవారం మదనపల్లె వారపు సంతలో జనసేనపార్టీ ఆధ్వర్యంలో జనం కోసం జనసేన పట్టణ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు, సంతకు వచ్చిన కొనుగోలు దారులకు జనసేన పార్టీ గాజు గ్లాసు ను వివరిస్తూ జనసేన పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్ రాయల్, రాష్ట్ర చేనేత విభాగ ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, టౌన్ ప్రెసిడెంట్ నాయని జగదీష్, రూరల్ మండల అధ్యక్షులు గ్రానైట్ బాబు, రామసముద్రం మండలం ఉపాధ్యక్షులు గడ్డం లక్ష్మిపతి, రెడ్డెమ్మ, చంద్రశేఖర, నవాజ్, జంగాల గౌతమ్, జయ, రాజారెడ్డి, రవి, విజయ్ కుమార్, గంగులప్ప, ఆది నారాయణ, నాగవేణి, లవన్న, పవన్ పాల్గొన్నారు.

102 వాహన సౌకర్యాలు వినియోగించుకోండి


తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-కలకడ

102 వాహన సౌకర్యాలు ప్రజలు వినియోగించు కోవాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జవహర్‌బాబు తెలిపారు. మండలంలోని బొం తలవారిపల్లి, కదిరాయచెరువు సచివాలయం నుంచి 102 వాహనం ద్వారా గర్భిణి కోటకొండ హిందూకు మొదటగా వైద్య సేవలు అందించి నట్లు తెలిపారు. హిమగ్లోబిన్ లెవెల్స్ శాతం 8.9 ఉండడం వల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎర్రకోటపల్లెలో ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్స్ ఇచ్చినట్లు తెలిపారు .మొదటి మోతాదు ఐరన్ సుక్రోజ్16/11/2023 వ తేదీన ఇవ్వడం జరిగినది. రోజు మార్చి రోజు ఐదు రోజులు ఐరన్ సుక్రోజ్ కోర్స్ వాడటం వల్ల ఆమెకు 9.6 హిమగులోబిన్ వచ్చినట్లు వైద్యాధికారి తెలిపారు. వైద్య సదుపాయాల లో స్టాఫ్ నర్స్ జె.భారతమ్మ చాకచక్యముతో కోటకొండ హిందూకు రోజు మార్చి రోజు ఐరన్ సుక్రోజ్ క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల 9.6కు చేరిందని స్టాఫ్ నర్స్ జె.భారతమ్మ తెలిపారు.

టీచర్ అవార్డు అందుకున్న ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ ఫార్మసిటిక్స్ అధ్యాపకులు పి.ద్వారకనాథ్‌రెడ్డి జెఎన్‌టియు అనంతపురం విశ్వవిద్యాలయం నుంచి యూనివర్సిటీ టీచర్ అవార్డ్స్ 2023ను అందుకున్నట్లు కళాశాల కార్యదర్శి చొప్ప గంగిరెడ్డి తెలిపారు. ద్వారకనాథ్‌రెడ్డి పరిశోధన, పత్ర ప్రదర్శనలు, పేటెంట్స్, పుస్తక రచనలు, పిహెచ్‌డి అవార్డులు, హాజరైన సదస్సులు, నైపుణ్యతతో కళాశాల అభివృద్ధికి వారు అందించిన సేవలు గుర్తించి జెఎన్‌టియు పురస్కారంతో సన్మానించిందని తెలిపారు. ఫార్మసి టికల్ సైన్స్ విభాగంలో ఈ అవార్డును జెఎన్‌టియు విసి ప్రొఫెసర్ జి.రంగజనార్ధన్, రిజిస్ట్రర్ శశిధర్‌ల చేతులు మీదుగా అందుకున్నారని, ఇది కళాశాలకు గర్వకారణమని అన్నారు. కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, కోశాధికారి అభిషేక్ రెడ్డి, చైర్మన్ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ స్వర్ణలతలు అభినందించారు.

మైనార్టీల సామాజికాభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మైనార్టీల సామాజికాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఉర్దూ అకాడమీ గ్రంథాలయం, కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం వైసిపి ప్రభుత్వంలో జరుగుతున్న కృషి గతంలో ఎప్పుడు జరగలేదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో చంద్రబాబునాయుడు మైనార్టీలను వంచనకు గురి చేయగా, ప్రస్తుత వైసిపి పాలనలో మైనార్టీలకు భరోసా కల్పించే విధంగా సిఎం జగన్మోహన్ రెడ్డి చర్యలు చేపడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలను సీఎం జగన్మోహన్‌రెడ్డి గుండెలో పెట్టుకొని సామాజిక అభివృద్ధికి అన్ని విధాల చేయూతనిస్తున్నట్లు వివరించారు. 2018లో అప్పటి సిఎం చంద్రబాబు నాయుడు దుల్హన్, విదేశీ విద్య పథకాలకు మంగళం పాడగా, సీఎం జగన్మోహన్ రెడ్డి తిరిగి వాటిని పునరుద్ధరించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల పథకం ద్వారా ముస్లిం మైనార్టీలకు ఎంతో ప్రయోజనం చేకూరిందని, వాల్మీకిపురం మండలంలోనే రూ.22.15 కోట్ల మేరకు లబ్ధి కలిగిందని అన్నారు. యోజకవర్గానికి చెందిన వైసిపి నేత డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్‌కు కేబినెట్ స్థాయి గల రాష్ట్ర మైనార్టీ కమీషన్ చైర్మెన్ గానూ, పీలేరు, గుర్రంకొండ, కలకడ, మహల్, పల్లవోలు పంచాయతీలలో ముస్లింలను సర్పంచులు గానూ, పీలేరు, గుర్రంకొండకు చెందిన వైసిపి నాయకులను జడ్పిటిసి సభ్యులుగా చేసి ముస్లింలకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలు సముచిత గౌరవాన్ని కల్పించారని పేర్కొన్నారు.

నేడు అనంతపురంలో సంగీత విభావరి

రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో అనంతపురంలో బుధవారం సాయంత్రం 'మెహఫిలే గజల్ ' సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ తెలిపారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ హిరియల్ నదీమ్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రసిద్ధ ఖవ్వాలీ గాయకులు నాగపూర్‌కు చెందిన ఫైసల్ అలీ ఖాద్రి, హయాత్, మజ్హర్ నిజామీ పాల్గొంటున్నట్లు వివరించారు. ఉర్దూ భాషాభివృద్ధిలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, ఉర్దూ భాష, సాహితీ అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు ఆబిద్ హుసేన, జాహెద్ హుసేన, సిటిసి ఇన్‌ఛార్జ్ ఫైరోజు ఖాన్ , సిబ్బంది ఫిరోజ్ పాల్గొన్నారు.


రాజంపేట :చమర్తి ఆధ్వర్యంలో పాదయాత్రకు బయలుదేరుతున్న టిడిపి శ్రేణులు

యువగళం సభకు తరలివెళ్లిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు ఆధ్వర్యంలో బుధవారం విజయనగరం జిల్లా పోలిపల్లిలో జరిగే యువగళం భారీ బహిరంగసభకు రాజంపేట నుంచి టిడిపి నేతలు భారీగా తరలి వెళ్లారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బయలుదేరారు. **వీరబల్లి :** రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు, మండల నాయకుడు శ్రీధర్ రెడ్డి, రెడ్డప్పరెడ్డి, మండల అధ్యక్షులు భానుగోపాల్ రాజు ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభకు వీరబల్లి నుంచి టిడిపి పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు.


ఎన్‌సిసి విద్యార్థులతో హెచ్ఎం పురుషోత్తంరెడ్డి

ఎన్‌సిసి విద్యార్థులు యువతకు ఆదర్శవంతంగా ఉండాలి

ప్రజాశక్తి-చిట్వేలి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సిసి ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి శిక్షణ తరగతులను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ ఎన్‌సిసి విద్యార్థులు పాఠశాలలో, సమాజంలో ఉన్న యువతకు ఆదర్శవంతంగా ఉండాలని తెలిపారు.ఎన్‌సిసి అధికారి పసుపుల రాజశేఖర్ మాట్లాడుతూ 30వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి కడప నుంచి వచ్చిన హవల్దార్లు సమయ సింగ్, సందీప్‌లు డ్రిల్, .22 రైఫిల్, 7.66 రైఫిల్, మ్యాప్ రీడింగ్ పై శిక్షణను ఇచ్చినట్లు తెలిపారు. 2024 జనవరిలో జరగబోయే ఎన్‌సిసి 'ఎ' సర్టిఫికెట్ పరీక్షపై అవగాహనను ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సిసి సార్జెంట్లు శరత్, లక్ష్మీ త్రివేణి, ఎన్‌సిసి కార్పురల్‌లు పసుపుల యజ్ఞదర్, నందినిలు, సీనియర్, జూనియర్ ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా నిలిచే నేత 'నల్లారి'

- రాజంపేట పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కుప్పం రవిచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పీలేరు



కష్టాల్లోని కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలిచే నేత టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి టిడిపి రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ కార్య నిర్వాహక కార్యదర్శి కుప్పం రవిచంద్రారెడ్డి తెపారు. మంగళవారం పీలేరులో ఆయన మాట్లాడుతూ. కిషోర్ కుమార్ రెడ్డి గత 30 ఏళ్లుగా తండ్రి నల్లారి అమర్నాథ్ రెడ్డికి తగ్గ తనయుడుగా, అయన అడుగుజాడల్లో నడుస్తూ, అన్న చాటు తమ్ముడిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఉన్నప్పటికీ నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టిన నల్లారి కిశోర్ కుమార్ ఓడ్డి సేవలు మరువలేనివని అన్నారు. నియోజకవర్గ పరిధిలో రోడ్లు, భవనాలు, వంతెనలు, పాఠశాలలు, నిర్మించి ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకున్నారని చెప్పారు. కె.వి పల్లి మండలంలోని జిల్లెళ్ళమందకుదారి లేక తమ గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లాలంటే మరో మార్గంలేక పింఛానదిలో తెప్పలపై ప్రయాణం చేసే పరిస్థితులు చూసి చలించిన తమ నేత, యుద్ధ ప్రాతిపదికన వంతెన నిర్మించి ఆ ప్రాంత ప్రజలకు వారధిగా నిలిచారన్నారు. నియోజక వర్గంలో ఏ కుటుంబానికి కష్టమొచ్చినా, నష్టమొచ్చినా నేనున్నానంటూ సమస్యకు పరిష్కారం చూపించి నిరంతరం ప్రజల్లో మమేకమైన దార్శనికుడని కొనియాడారు.టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటనా కార్యక్రమాలకు హాజరైన కార్యకర్తలపై అధికార వైసిపి నాయకులు ఉద్దేశపూర్వకంగా, కక్ష పూరితంగా పీలేరు నియోజకవర్గ పరిధిలోని తమ అభిమానులపై అక్రమ కేసులు నమోదు చేస్తే, వందల మందికి ముందస్తు బెయిల్ తీసుకొస్తూ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకున్నారని అన్నారు. 2024 ఎన్నికల్లో అందరి సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త ఒక సైనికుడిగా గ్రామ స్థాయి నుండి మన ప్రియతమ నాయకుడు కిషోర్ కుమార్ రెడ్డి గెలుపే లక్ష్యంగా మనమందరం కలిసి పని చేద్దామని ఆయన పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులకు పిలుపునిచ్చారు.

క్రైం కార్నర్

పాల వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలం, వేపూరికోట సమీపంలోని చీకుచెట్టుపల్లి వద్ద పాలట్రక్కు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు.. తంబళ్లపల్లి మండలం అన్నగారిపల్లి పంచాయతీ, పాలెం చింతల రేవుపల్లెకు చెందిన రమణప్ప కొడుకు ఎస్.గంగాద్రి(24) బైకులో సొంత పనిపై ములకల చెరువు మండలంలోని వేపూరికోటకు వెళ్ళాడని తెలిపారు. అక్కడ పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బైకులో వస్తుండగా మార్గమధ్యంలోని వేపూరు కోట సమీపాన ఉన్న చీకటి పల్లి వద్ద అర్ధ రాత్రి వేళ పాల ట్రక్కు గంగాద్రి ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్ళాడని తెలిపారు. ఎస్ఐ గాయత్రి సంఘటన స్థలానికి చేరుకొని రక్తపు మడుగులో పడి ఉన్న క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. జిల్లా ఆస్పత్రి అత్యవసర విభాగంలో చికిత్స అందించేలోపే గంగాద్రి మృతి చెందినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తంబళ్లపల్లి మండలంలోని చింతల రేవు పల్లెలో గంగాద్రి మృతి చెందడంతో విషాదం అలుముకుంది.

ప్రేయసి మోసం చేసిందని నిప్పంటించుకున్న ప్రియుడు

ప్రజాశక్తి-ములకలచెరువు

ప్రేయసి మోసం చేసిందని ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన ములకల చెరువు మండలంలో మంగళవారం జరిగింది. బాధితుడి కుటుంబీకులు, ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా వున్నాయి.. మండలంలోని చౌడసముద్రము పంచాయితీ, చెట్లవారిపల్లికి చెందిన శీనప్ప కుమారుడు వి.సోమశేఖర్ అలియాస్ సోము (24) ఓ అమ్మాయిని ప్రేమించినట్లు తెలిపారు. పెళ్లికి ఆమె నిరాకరించి మరో యువకునితో సన్నిహితంగా ఉన్నట్లు తెలిపారు.ఈ విషయం తెలుసుకున్న సోమశేఖర్ తీవ్ర మనస్థాపంతో మనోవేదనకు గురై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో వున్న పెట్రోల్ ఒంటిపై పోసుకుని నిప్పు అంటించు కుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు చెప్పారు. కుటుంబీకులు గమనించి బాధితుడిని చికిత్స కోసం వెంటనే 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు అతన్ని పరీక్షించి మెరుగైన వైద్య చికిత్సలు అందించారు. అయినా ఆరోగ్యం కుదుట పడక పోవడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి వెళ్లాలని డాక్టర్లు సూచించారు.ఈ ఘట నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.